B9 NEWS
నిజం - మా ఇజం

మన.. ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం...



PUBLISHED FROM: Telangana & Andhrapradesh | సంపుటి : 01 | సంచిక : 278 | శనివారం 07-11-2026 | ఎడిటర్ : పులిజ్వాల చంద్రకాంత్ | పేజీలు : 08 | వెల : 05/-



బాలరాజు యాదవ్ అరెస్ట్..

కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

బీఆర్ఎస్ నేత దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్ట్

అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసులు

రాజకీయ కక్ష సాధింపేనంటూ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

మన ప్రజాపక్షం,హైదరాబాద్

బీఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్టుపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. రాజకీయ విమర్శలకు పోలీసు కేసులతో బదులివ్వడం దుర్మార్గమని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరని హెచ్చరించారు.కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ భార్య ఇందుజా రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బాలరాజు యాదవ్‌ను అరెస్టు చేశారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు

పెట్టుబడులకు గ్లోబల్‌హబ్‌గా తెలంగాణ



- యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం
- పికో టెక్నాలజీ ప్రారంభోత్సవంలో మంత్రులు దుద్దిళ్ల, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా, ప్రపంచ స్థాయి పారిశ్రామిక సంస్థలకు ఆకర్షణీయమైన కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులను తీసుకురావడంతో పాటు యువత నైపుణ్యానికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. న్యూయార్క్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ ఫైనాన్షియల్ మార్కెట్ టెక్నాలజీ సొల్యూషన్ సంస్థ 'పికో టెక్నాలజీ ఇండియా' ప్రధాన కార్యాలయాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు తెలంగాణ వైపు చూసేలా రాష్ట్రంలో అనుకూలమైన పారిశ్రామిక వాతావరణాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు."పెట్టుబడిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందిస్తూ పరిశ్రమల స్థాపనకు పూర్తి ప్రోత్సాహం ఇస్తున్నాం. కొత్త సంస్థల రాకతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడమే కాకుండా యువతకు మెరుగైన భవిష్యత్తు



మూడ్రోజుల పర్యటన

- కొడంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి మెగా ప్లాన్..
- నేటి నుంచి సీఎం రేవంత్ రెడ్డి మూడు రోజుల కొడంగల్ పర్యటన ఖరారు
- సుమారు రూ.9100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- రైతు మేళా, పరిశ్రమలు, విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి
- వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలు, పోలీస్ స్టేషన్ల ప్రారంభోత్సవాలు
- పర్యటన ముగింపులో భారీ రైతు బహిరంగ సభ ఏర్పాటు

2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. నియోజకవర్గ రూపురేఖలను మార్చే లక్ష్యంతో సుమారు రూ.9,100 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా నవంబర్ 7, 8, 9 తేదీల్లో ఆయన కొడంగల్‌లో కీలక పర్యటన చేపట్టనున్నారు. ఈ మూడు రోజుల పర్యటనలో భాగంగా భారీ ఎత్తున శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్‌ను అధికారులు ఖరారు చేశారు. ఈ పర్యటనలో భాగంగా

పుష్కరాల పనుల్లో జాప్యానికి తావివ్వొద్దు



2

60 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు..

ప్రభుత్వం తీసుకుంది 18 టీఎంసీలే: రేవంత్ సర్కార్‌పై హరీశ్ ఫైర్

కరవుకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమన్న హరీశ్‌రావు

పరిస్థితిని 'రేవంత్ వృష్టి'గా అభివర్ణన

దేవాదుల నుంచి 18 టీఎంసీలే ఎత్తిపోశారని ఆరోపణ

కల్వకుర్తి మోటార్లు పూర్తిస్థాయిలో నడపడం లేదని విమర్శ

పంటల బీమా అమలు చేయలేదని కాంగ్రెస్‌పై ధ్వజం



2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. "ఇది అతివృష్టి కాదు.. అనావృష్టి కాదు.. రేవంత్ వృష్టి" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో

కుర్చీలో ఆర్టీసీ డీఎం నేలపై కార్మికులు..

మంత్రి పొన్నం సీరియస్!

- సిద్దిపేట ఆర్టీసీ డీఎం వ్యవహారశైలిపై మంత్రి పొన్నం ఆగ్రహం!
- కార్మికులను నేలపై కూర్చోబెట్టిన ఘటనపై విచారణకు ఆదేశం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీకి సూచన
- కార్మికుల ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తే సహించబోమని హెచ్చరిక



2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ (డీఎం) వ్యవహారశైలిపై తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. కార్మికులతో సమావేశమైన సమయంలో డీఎం కుర్చీలో కూర్చోగా, కార్మికులు నేలపై కూర్చున్నట్లుగా

నిర్ణీత గడువులోగా ఆదాయ లక్ష్యాలను సాధించాలి

మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో భట్టి

మైనారిటీల విద్యా సదుపాయాలకు సత్వరమే నిధులు



2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించాలని డిప్యూటీ సీఎం భట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన... ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో

మహారాష్ట్రను ఒప్పిస్తాం

త్వరలోనే తుమ్మిడిహెట్టి పనులు ప్రారంభిస్తాం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

మహారాష్ట్రను ఒప్పించి తుమ్మిడిహెట్టి ప్రాజెక్ట్ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని గుమస్తాకాలనీ వద్ద రూ.33 కోట్లతో నిర్మించిన 560 డబుల్ బెడ్‌రూం ఇళ్లను(జ్యోతిరావుపూలే కాలనీ) శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ప్రభుత్వ విప్,

అక్రమాలకు పాల్పడ్డారో రిజిస్ట్రేషన్ రద్దే!

- ఐవీఎఫ్ కేంద్రాలకు సర్కారు హెచ్చరిక
- బాధ్యులైన వైద్యుల లైసెన్సుల రద్దుకు చర్యలు
- సరగసి ఏఆర్‌టీ చట్టాల అమలుపై నిపుణుల కమిటీ
- ఆరోగ్యశాఖ అధికారులతో మంత్రి దామోదర సమీక్ష



2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

రాష్ట్రంలో ఐవీఎఫ్ కేంద్రాల ముసుగులో జరుగుతున్న అక్రమాలు, దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని ఆరోగ్యశాఖ మంత్రి

తేలనున్న అభ్యర్థుల భవితవ్యం



2

మన ప్రజాపక్షం,అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ (పరిషత్) ఎన్నికల ఓట్ల లెక్కింపు శనివారం (నవంబర్ 7) ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఇందుకోసం రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లనూ పూర్తి చేసింది. ఏకగ్రీవాలు పోగా సుమారు 7,767 ఎంపీటీసీ, 582 జడ్పీటీసీ స్థానాలకు ఓట్ల లెక్కింపు జరగనుంది.

- నేడుఉదయం 8 గంటలకు పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపు
- రాష్ట్రవ్యాప్తంగా 70.72 శాతం పోలింగ్ నమోదు
- విశాఖలో అత్యధికంగా 82.51 శాతం, అల్లూరిలో అత్యల్పంగా 62.01 శాతం
- 28 జిల్లాల్లో 365 కౌంటింగ్ కేంద్రాలు, 30 వేలకు పైగా సిబ్బంది
- మధ్యాహ్నానికి ఎంపీటీసీ, రాత్రికి జడ్పీటీసీ ఫలితాలు వచ్చే అవకాశం

All are Continues Second Page

మూడ్రోజుల పర్యటన

మొదటి పేజీ తరువాయి

రెండు రాత్రులు ఆయన కొడంగల్‌లోనే బస చేయనున్నారు. మూడు రోజుల పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి.

నవంబర్ 7 (శనివారం):

ఉదయం 11 గంటలకు హకీంపేటలో మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

అనంతరం రైతు మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శిస్తారు. ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహిస్తారు.

పారిశ్రామికవేత్తలతో సమావేశమై, పెట్టుబడుల అవకాశాలపై చర్చిస్తారు.

రాత్రికి కొడంగల్‌కు చేరుకుని అక్కడే బస చేస్తారు.

నవంబర్ 8 (ఆదివారం):

హకీంపేటలో స్వయం సహాయక సంఘాల (౫ఎ+) మహిళలతో సమావేశమవుతారు.

ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

హకీంపేటలో నూతనంగా నిర్మించిన పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలను ప్రారంభిస్తారు.

బొంరాస్‌పేట, కొడంగల్, దుద్యాల మండలాల్లో పోలీస్ స్టేషన్లు, ఇతర ప్రభుత్వ భవనాలను ప్రారంభిస్తారు.

నాచారం వద్ద రూ.5,060 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు-2 పనులకు శంకుస్థాపన చేస్తారు.

కోస్గిలో సైన్స్ మ్యూజియం, దౌలతాబాద్‌లో జూనియర్ కళాశాల, బాలంపేటలో పీహెచ్‌సీని ప్రారంభిస్తారు.

రాత్రి కొడంగల్‌లోనే బస చేస్తారు.

నవంబర్ 9 (సోమవారం):

ఈ మూడు రోజుల పర్యటనలో మొత్తం రూ.9,053.48 కోట్ల విలువైన 13 కీలక అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేయనున్నారు.

పర్యటన ముగింపులో భాగంగా హకీంపేటలో ఏర్పాటు చేసే భారీ రైతు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.

ఈ పర్యటన ద్వారా కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టమవుతోంది.

కుర్చీలో ఆర్టీసీ డీఎం
నేలపై కార్మికులు..

మొదటి పేజీ తరువాయి

ప్రచారంలోకి వచ్చిన ఘటనపై ఆయన పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీతో మాట్లాడి, ఘటనకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "సిద్దిపేట డిపోలో జరిగిన ఘటన నా దృష్టికి వచ్చింది. ఈ అంశంపై తక్షణమే ఆర్టీసీ ఎండీతో మాట్లాడి, సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించాను. విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి" అని తెలిపారు.ప్రజా పాలన ప్రభుత్వంలో కార్మికుల సంక్షేమానికి, వారి ఆత్మగౌరవానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు. "ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకం. సంస్థ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికులను గౌరవంగా చూడాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉంది. వారి ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ఎవరు వ్యవహరించినా సహించే ప్రసక్తే లేదు" అని మంత్రి స్పష్టం చేశారు.కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా, అగౌరవంగా ప్రవర్తించే అధికారులపై భవిష్యత్తులో కఠిన చర్యలు తప్పవని పొన్నం ప్రభాకర్ గట్టిగా హెచ్చరించారు. అధికారులు తమ పరిధిలో కార్మికులతో గౌరవప్రదంగా, బాధ్యతాయుతంగా మెలగాలని ఆయన హితవు పలికారు.

పుష్కరాల పనుల్లో జాప్యానికి తావివ్వొద్దు

మొదటి పేజీ తరువాయి

గోదావరి పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అన్ని వసతులు కల్పిస్తూ.. పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయడంతోపాటు, పూర్తయిన పనుల నాణ్యతను పరిశీలించి, మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు.జగిత్యాల జిల్లా ధర్మపురి తదితర ప్రాంతాల్లో చేపడుతోన్న అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుష్కరాల పనుల్లో నీటిపారుదల, పంచాయతీరాజ్, రోడ్లు-భవనాలు (ఆర్‌అండ్‌బీ), దేవాదాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ఒక శాఖ పనుల వల్ల మరో శాఖ పనులకు ఆటంకం కలగకుండా ముందస్తు కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు.



బాలరాజు యాదవ్ అరెస్ట్..

మొదటి పేజీ తరువాయి

చేశారు. కేటీఆర్, హరీశ్ రావులపై బల్మూర్ వెంకట్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బాలరాజు యాదవ్ ఇటీవల మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నేపథ్యంలోనే ఆయనపై అట్రాసిటీ కేసు పెట్టడం రాజకీయ కక్ష సాధింపేనని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది.ఈ అరెస్టుపై కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "రాజకీయ విమర్శలకు సమాధానం రాజకీయంగానే చెప్పాలి తప్ప పోలీసు కేసులతో కాదు. అరెస్టు పేరుతో బాలరాజు యాదవ్‌ను సిటీ అంతా తిప్పుతూ ఆయన కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గం. అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరు" అని కేటీఆర్ పేర్కొన్నారు.బాలరాజు యాదవ్‌పై పెట్టిన కేసును తక్షణమే ఉపసంహరించుకుని, ఆయనను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును కాలరాయలేరని హితవు పలికారు. ఈ అరెస్టును బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కూడా ఖండించారు.

60 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు..

మొదటి పేజీ తరువాయి

ధ్వజమెత్తారు. నదుల్లో పుష్కలంగా నీళ్లున్నా.. పంపులు నడిపి పొలాలకు నీటిని అందించలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో సహా ఎండగడతామని హెచ్చరించారు.దేవాదుల ప్రాజెక్టు ద్వారా 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలకే పరిమితమైందని హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నీటిని దిగువకు వదిలేస్తుంటే.. ఏపీ సీఎం చంద్రబాబు వాటిని ఒడిసిపట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. శ్రీశైలంలో తగినంత నీరు ఉన్నా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వద్ద పూర్తిస్థాయిలో మోటార్లు నడపడం లేదని విమర్శించారు. మరోవైపు చంద్రబాబు 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం వరకు నీటిని తరలించుకుపోయారని పేర్కొన్నారు.గ్లోబల్ వార్మింగ్, ఎల్‌నినో ప్రభావం ఉండొచ్చని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో పంటల బీమాపై హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు.. అధికారంలోకి వచ్చాక దాన్ని అమలు చేయడం మరిచిపోయారని విమర్శించారు. పంటల బీమా అమల్లో ఉంటే రైతులకు కొంతైనా నష్టపరిహారం అందేదని అన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో కరవు సాయం కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతులకు అందిస్తున్నారని గుర్తుచేశారు.రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఇంతటి తీవ్రమైన పరిస్థితి ఉన్నా కనీసం క్యాబినెట్ సమావేశంలోనూ దీనిపై చర్చించకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు.

అక్రమాలకు పాల్పడ్డారో
రిజిస్ట్రేషన్ రద్దే!

మొదటి పేజీ తరువాయి

దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడే ఐవీఎఫ్ కేంద్రాలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. అండాల అక్రమ సేకరణ ముఠాతో సంబంధాలున్న అన్ని ప్రైవేటు ఐవీఎఫ్ కేంద్రాలను శాశ్వతంగా సీజ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమాల్లో భాగస్వాములైన వైద్యుల లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని ఆదేశించారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ ఆరోగ్యశాఖ అధికారులు నిరంతర నిఘా, తనిఖీలు కొనసాగిస్తున్నారని తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ముషారఫ్ అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అండాల అక్రమ సేకరణ కేసుకు సంబంధించిన వివరాలను మంత్రికి అధికారులు వివరించారు. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న వ్యక్తులు, సంస్థలపై సమగ్ర విచారణ జరిపి, దోషులకు చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అక్రమాలకు పాల్పడిన వైద్యులపై చర్యల విషయంలో రాష్ట్ర వైద్య మండలి, జాతీయ వైద్య మండలి అధికారులతో సంప్రదింపులు జరిపి, నిబంధనల ప్రకారం వారి లైసెన్సుల రద్దుకు సిఫారసు చేయాలని స్పష్టం చేశారు.సరగసి, అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ) చట్టాల అమలును మరింత పటిష్ఠం చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ చట్టాల అమలులో ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలు, తీసుకుంటున్న చర్యలను అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించారు. దేశవ్యాప్తంగా అమలులో ఉన్న కేంద్ర చట్టాల పరిధిలోనే రాష్ట్ర స్థాయిలో అదనపు నియంత్రణ చర్యలు, మార్గదర్శకాలు రూపొందించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ప్రైవేటు ఐవీఎఫ్ కేంద్రాల కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఐవీఎఫ్ చికిత్సలో ఉపయోగించే మెడిసిన్ తయారీ నుంచి అమ్మకాల వరకూ ప్రత్యేకంగా నిఘా పెట్టాలని సూచించారు.



తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

మొదటి పేజీ తరువాయి

70.72 శాతం పోలింగ్

నవంబర్ 5న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బ్యాలెట్ పేపర్ల ద్వారా పోలింగ్ జరిగింది. ఎంపీటీసీ ఎన్నికలకు గులాబీ రంగు, జడ్పీటీసీ ఎన్నికలకు తెలుపు రంగు బ్యాలెట్ పేపర్లను ఉపయోగించారు.వర్షాలు, వరదల కారణంగా 5 మండలాల్లో, సాంకేతిక సమస్యల వల్ల మరికొన్ని చోట్ల రీపోలింగ్ అవసరమైంది. ఇది నవంబర్ 6న ప్రశాంతంగా ముగిసిందని అధికారులు తెలిపారు.రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన తుది గణాంకాల ప్రకారం మొత్తం పోలింగ్ శాతం 70.72గా నమోదైంది. విశాఖపట్నం జిల్లా ప్రాంతాల్లో అత్యధికంగా సుమారు 82.51 శాతం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యల్పంగా సుమారు 62.01 శాతం పోలింగ్ జరిగింది. ఇతర జిల్లాల్లో శ్రీకాకుళం 65.51, అనకాపల్లి 75.58, చిత్తూరు 76.30, కృష్ణా 73.21 శాతంగా నమోదైంది.

కౌంటింగ్ ఏర్పాట్లు

28 జిల్లాల్లో 365 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 9,000కు పైగా టేబుళ్లు సిద్ధం చేశారు. 30 వేల నుంచి 40 వేల మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటారు. వీరిలో 11 వేలకు పైగా సూపర్‌వైజర్లు ఉన్నారు. కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు, 144 సెక్షన్ అమలులో ఉంటుంది. భారీ భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రాలకు తరలిస్తున్నారు.

లెక్కింపు ప్రక్రియ, ఫలితాల సమయం

ఉదయం 8 గంటలకు ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. ఆ తర్వాత అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులు తెరుస్తారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్లను వేరు చేసి చేతితో లెక్కిస్తారు కాబట్టి ఎక్కువ సమయం పడుతుంది.తొలి అధికారిక ట్రెండ్స్ సుమారు 4 గంటల తర్వాత, అంటే మధ్యాహ్నం లేదా ఆ తర్వాత వెలువడే అవకాశం ఉంది. ఎంపీటీసీ ఫలితాలు మధ్యాహ్నం 3 గంటల సమయానికి, జడ్పీటీసీ ఫలితాలు సాయంత్రం 7 గంటల సమయానికి వస్తాయని అంచనా. ఒక్కో స్థానం లెక్కింపు పూర్తయ్యే కొద్దీ ఫలితాలు రాత్రి వరకు కొనసాగే అవకాశం ఉంది.జిల్లాలు, మండలాల వారీ ఫలితాలను రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ంవఽ.ఖజూ.స్త్రశీజ.అఅ తో పాటు తెలుగు మీడియా ద్వారా తెలుసుకోవచ్చు.

నిర్ణీత గడువులోగా ఆదాయ లక్ష్యాలను సాధించాలి

మొదటి పేజీ తరువాయి

మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ... పారిశ్రామిక లే-అవుట్లు, పాత పారిశ్రామికవాడల్లోని భూముల వినియోగం, క్రమబద్ధీకరణ వంటి మార్గాల ద్వారా ఆదాయ సమీకరణకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. అజామాబాద్, బాలానగర్, హఫీజ్‌పేట వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో యూనిట్లవారీగా భూముల క్రమబద్ధీకరణ, అనుమతుల ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. చిన్న తరహా పారిశ్రామిక యూనిట్లకు సంబంధించిన ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించాలని, పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించడంతో పాటు ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా మైనారిటీల సంక్షేమంపై మంత్రి అజారుద్దీన్‌తో కలిసి భట్టి ప్రజాభవన్‌లో సమీక్ష నిర్వహించారు. మైనారిటీల విద్యా సదుపాయాలకు నిధుల విడుదలలో జాప్యం, ఆంక్షలు ఉండబోవని భరోసా ఇచ్చారు. నగరంలోని పాత బస్తీ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు వెచ్చిస్తోందని తెలిపారు. నాంపల్లిలోని హజ్ హౌజ్ పక్కన అసంపూర్తిగా నిలిచిపోయిన బహుళ అంతస్తుల భవన నిర్మాణ పూర్తికి అంచనాలను రూపొందించాలన్నారు. జీహెచ్ఎంసీ నుంచి వక్ఫ్‌బోర్డుకు రావాల్సిన నిధుల్లో రూ.25 కోట్లను దీనికి కేటాయించాలని ఆదేశించారు. మైనారిటీ విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం పరిధిని విస్తరించనున్నామని తెలిపారు.

మహారాష్ట్రను ఒప్పిస్తాం

మొదటి పేజీ తరువాయి

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. తమ ఐదేళ్ల పాలన నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో బంగారు కాలంగా నిలిచిపోతుందన్నారు. గత ప్రభుత్వం పూర్తి చేయని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామన్నారు. జిల్లాలోని బస్వాపూర్, ధర్మారెడ్డికాల్వ, పిలాయిపల్లి, మిర్యాలగూడ నియోజకవర్గంలో తోపుచర్ల, కేశవాపూర్, కొండ్రపోలు, దున్నపోతులగండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేసి సాగు నీరు అందిస్తామని చెప్పారు. మండలి చైర్మన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్ఎల్‌బీసీ పూర్తయితే గ్రావిటీపై నల్లగొండ, నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందుతుందన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయించాలన్నారు.

పెట్టుబడులకు గ్లోబల్‌హబ్‌గా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి



లభిస్తుంది." అని వివరించారు. రాష్ట్ర పెట్టుబడుల సామర్థ్యాన్ని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పేందుకు తాము తీసుకొచ్చిన గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమం కీలక వేదికగా నిలిచిందని చెప్పారు.

అనంతరం మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. నూతన ఆవిష్కరణలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రపంచస్థాయి కంపెనీలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ముందుకు రావడం తెలంగాణ అభివృద్ధికి నిదర్శనమని అన్నారు. పికో టెక్నాలజీ వంటి సంస్థలు హైదరాబాద్‌లో తమ ప్రధాన కార్యాలయాలను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. 19 నుంచి ఇండియన్ రోడ్ కాంగ్రెస్ భేటీలు 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశాలు నిర్వహించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశాల్లో, దేశవ్యాప్తంగా రహదారుల రంగానికి చెందిన నిపుణులు, ఇంజనీర్లు పాల్గొని కీలక అంశాలపై చర్చించనున్నారని పేర్కొన్నారు.

రూ.83 లక్షలతో రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం

అల్వాల్‌లో సీసీ, బీటీ రోడ్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నవంబర్ 06, అల్వాల్ :
మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం అల్వాల్ డివిజన్‌లోని పలు కాలనీల్లో మొత్తం రూ. 83 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి భూమిపూజ నిర్వహించారు. అల్వాల్ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక కాలనీవాసులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.వాసవి నగర్ కాలనీలో రూ. 8 లక్షలతో సీసీ రోడ్డు, భీమ్ రావు నగర్‌లో రూ. 8 లక్షలతో సీసీ రోడ్డు, సంపతీ చిత్తారీ కాలనీలో రూ. 24 లక్షలతో సీసీ రోడ్డు, రిట్రీట్ కాలనీలో రూ. 18 లక్షలతో సీసీ రోడ్డు,



బీహెచ్‌ఈఎల్ కాలనీలో రూ. 25 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే రహదారి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు డీఈ మహేష్, ఏఈ అరుణ్, మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జేఏసీ సురేందర్ రెడ్డి, డోలి రమేష్, నేమురి శ్రీధర్ గౌడ్, శరణగిరి, సురేష్, శోభన్ బాబు, సందీప్, మహేందర్ గౌడ్, రాజేందర్, అరుణ్, సాజిద్, అరవిందు, సందీప్, లోకేష్, లింగారెడ్డి, జనార్దన్, నర్సింగ్ రావు, అమూల్, రామానుజన్, రాకేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక కాలనీవాసులు పాండే, ముత్యాలు, జైపాల్ తదితరులు హాజరయ్యారు.

ఏఐ బుడగ బద్దలవుతోందా? ఒక్కరోజే రూ.లక్షల కోట్ల సంపద ఆవిరి!

ప్రపంచ మార్కెట్లలో సాంకేతిక సంస్థల షేర్ల పతనం.. పెట్టుబడిదారుల్లో ఆందోళన

నవంబర్ 06,
ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగంలో భారీ పెట్టుబడులు పెట్టిన సాంకేతిక దిగ్గజాలకు ఇప్పుడు ఆర్థిక సవాళ్లు ఎదురవుతున్నాయి. ఏఐ ఆధారిత ప్రాజెక్టులు, ఉత్పత్తుల ద్వారా ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడం పెట్టుబడిదారుల్లో ఆందోళనకు కారణమవుతోంది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లలో ఏఐ ఆధారిత సాంకేతిక సంస్థల వాటాల అమ్మకాలు పెరిగి అమెరికా, చైనా, దక్షిణ కొరియా మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయి.అమెరికా మార్కెట్‌లో సాంకేతిక సంస్థల సూచీ నాస్‌డాక్ 100 గురువారం ఒక్కరోజే 6 శాతం పడిపోయినట్లు కథనం పేర్కొంది. మార్చి 2020 తర్వాత ఇదే అతిపెద్ద రోజువారీ పతనంగా తెలిపింది. ఒక్కరోజులో



సుమారు 2.5 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడిదారుల సంపద ఆవిరైందని, అందులో దాదాపు ట్రిలియన్ డాలర్లు ఏఐ ఆధారిత సాంకేతిక దిగ్గజాలకు చెందినవని వెల్లడించింది. మైక్రోసాఫ్ట్, గూగుల్, ఓపెన్‌ఏఐ, ఎన్‌విడియా, మెటా వంటి సంస్థల షేర్లు భారీగా పడిపోయినట్లు వివరించింది.ఏఐ నమూనాల శిక్షణ, సమాచార కేంద్రాలు, చిప్‌ల తయారీ కోసం భారీగా ఖర్చు చేస్తున్న సంస్థలకు పెట్టుబడులకు తగిన ఆదాయం వస్తుందా అన్న సందేహాలు నెలకొన్నాయి. చైనా మార్కెట్లలోనూ ఏఐ రంగానికి సంబంధించిన సంస్థల షేర్లు ఒత్తిడికి గురవుతున్నాయని కథనం తెలిపింది. దక్షిణ కొరియాలో అమ్మకాల ఒత్తిడి కారణంగా 20 నిమిషాల పాటు వాటాల లావాదేవీలు నిలిచిపోయినట్లు పేర్కొంది. శామ్‌సంగ్, ఎస్కే హైనిక్స్ సంస్థల షేర్లు కూడా క్షీణించాయని వివరించింది.భారత్, ఫిలిప్పీన్స్ వంటి దేశాల్లో సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, వ్యాపార ప్రక్రియల నిర్వహణ సేవల రంగాలపై ఈ పరిణామాలు తాత్కాలిక ప్రభావం చూపే అవకాశం ఉందని కథనం విశ్లేషించింది. ఏఐ ప్రాజెక్టులు ఆర్థికంగా ఆశించిన ఫలితాలను అందించకపోతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై మరింత ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉందని పేర్కొంది. అయితే ఏఐ రంగంలో ప్రస్తుత పరిణామాలు నిజంగా ఆర్థిక బుడగ పతనానికి సంకేతమా అన్నది రానున్న రోజుల్లో మార్కెట్ల పనితీరు, సంస్థల ఆదాయాలపై ఆధారపడి ఉంటుంది.

భువనగిరిలో ఘనంగా జిల్లా యువజన ఉత్సవాలు

యువతే దేశానికి వెన్నెముక..కళా, క్రీడా ప్రతిభను వెలికితీయడానికే వేదిక

మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్



నవంబర్ 06, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, కేంద్రంలోని చారిత్రక భువనగిరి ఖిల్లా సమీపంలో జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వామి వివేకానందుడి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని, దేశాభివృద్ధికి యువతే పట్టుగొమ్మ అని పేర్కొన్నారు. యువతలో దాగి ఉన్న కళా, సాంస్కృతిక, క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికే ప్రభుత్వం ఇలాంటి ఉత్సవాలను నిర్వహిస్తోందన్నారు. స్పష్టమైన లక్ష్యంతో శ్రమిస్తే సాధించలేనిది ఏదీ ఉండదని, యువత పెడదోవ పట్టకుండా చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు సభికులను విశేషంగా అలరించాయి. వివిధ పోటీల్లో ప్రతిభ చాటిన విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ వేడుకల్లో స్థానిక కౌన్సిలర్లు, జిల్లా క్రీడా శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



మల్లగూడెంలో పోషకాహార ఆరోగ్య శిబిరం

నవంబర్ 06,
యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం మల్లగూడెం గ్రామంలో వైద్యుల ఆధ్వర్యంలో పోషకాహార, ఆరోగ్య శిబిరం నిర్వహించారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో స్థానికులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు, సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జేన్నపల్లి బాలరాజ్ రెడ్డి, వైద్యులు లక్ష్మణ్, సిద్ధార్థ్, వార్డు సభ్యులు గొడుగు బ్రహ్మయ్య, బోయిని నాగరాజులతో పాటు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాజీ జడ్పీటీసీ బొల్లం అజయ్‌కు టీఆర్పీ శ్రేణుల ఘన నివాళి

బాధిత కుటుంబానికి అండగా ఉంటామని నేతల భరోసా

భౌతికకాయం వద్ద అంజలి ఘటించిన డాక్టర్ కల్నల్ మాచర్ల బిక్షపతి

నవంబర్ 06, తెలంగాణ బ్యూరో :
ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన రఘునాథపల్లి మండల మాజీ జడ్పీటీసీ బొల్లం అజయ్ మృతి పట్ల తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) జిల్లా నాయకత్వం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. శుక్రవారం ఆయన స్వగ్రామంలో ఉంచిన భౌతికకాయాన్ని టీఆర్పీ జిల్లా నాయకులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.పార్టీ జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్నల్ మాచర్ల బిక్షపతి, జిల్లా అధ్యక్షులు కట్ల సదానందం ముదిరాజ్, సంజీవ తదితరులు అజయ్ భౌతికకాయంపై పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బొల్లం అజయ్ అకాల మరణం అత్యంత బాధాకరమన్నారు. ఆత్మగౌరవం, ఆర్థిక భరోసా లక్ష్యంగా పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఇలాంటి విషాదకర ఘటనలు చోటుచేసుకోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుగ్గా వ్యవహరించిన ఒక ప్రజాప్రతినిధిని కోల్పోవడం మండల ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు.

హైదరాబాద్‌ను వెంటాడుతున్న నీటి కష్టాలు..
వేసవికి ముందే ట్యాంకర్లకు భారీ డిమాండ్!

అక్టోబర్‌లోనే 2.2 లక్షలకు చేరిన నీటి ట్యాంకర్ల బుకింగ్‌లు.. గతేడాదితో పోలిస్తే భారీ పెరుగుదల

నవంబర్ 06, హైదరాబాద్ :
హైదరాబాద్ మహానగరంలో నీటి కొరత ఆందోళనకరంగా మారుతోంది. సాధారణంగా వేసవి కాలంలో కనిపించే నీటి ట్యాంకర్ల రద్దీ ఈసారి అక్టోబర్ నెలలోనే మొదలైంది. జలమండలి చరిత్రలో తొలిసారిగా అక్టోబర్‌లో 2.2 లక్షల నీటి ట్యాంకర్లు బుక్ అయినట్లు కథనం వెల్లడించింది. గతేడాది ఇదే నెలలో 87 వేల ట్యాంకర్లు మాత్రమే బుక్ కాగా, ఈసారి ఆ సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం రోజుకు 7 వేలకు పైగా ట్యాంకర్ల బుకింగ్‌లు నమోదవుతున్నట్లు పేర్కొంది.ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, భూగర్భ జలమట్టాలు పడిపోవడం, బోర్లు ఎండిపోవడం నీటి సమస్యకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, టీఎన్‌జీఓఎస్ కాలనీల్లో పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు కథనం తెలిపింది. ఆయా ప్రాంతాల్లోని నీటి నింపే కేంద్రాల వద్ద ప్రతిరోజూ 250 నుంచి 300 ట్యాంకర్లు



బారులు తీరుతున్నాయి. అపార్ట్‌మెంట్లు, నివాస గృహాలు, వాణిజ్య సముదాయాలు నీటి అవసరాల కోసం ట్యాంకర్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్ల సరఫరాకు రెండు, మూడు రోజుల సమయం పడుతోంది.మరోవైపు ప్రైవేటు ట్యాంకర్ల ధరలు కూడా పెరిగి కొన్ని ప్రాంతాల్లో రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో రానున్న నెలల్లో సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. నగరానికి రోజుకు సుమారు 735 మిలియన్ గ్యాలన్ల నీరు అవసరమవుతుండగా, ప్రస్తుతం సరఫరా ఆ అవసరానికి తగిన స్థాయిలో లేదని కథనం పేర్కొంది.నీటి కొరతను ఎదుర్కొనేందుకు జలమండలి అదనపు నీటి నింపే కేంద్రాలు, ట్యాంకర్ల ఏర్పాటుపై చర్యలు చేపడుతోంది. అయితే ప్రజలు కూడా నీటి వినియోగంలో పొదుపు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన మురుగునీటిని వినియోగించడం, వర్షపు నీటి సంరక్షణ పద్ధతులను అమలు చేయడం, భూగర్భ జలాలపై ఆధారపడటాన్ని తగ్గించడం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వేసవి ప్రారంభానికి ముందే నీటి డిమాండ్ పెరగడం నగర భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తోంది.

సాయుధ పోరాట చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నల్లా నర్సింహులు వర్ధంతి సభలో వక్తలు

వంబర్ 06, తెలంగాణ బ్యూరో :
హైదరాబాద్ (రవీంద్రభారతి) తెలంగాణ ప్రాంతంలో సాగిన మహత్తర వీర పోరాట చరిత్రను నేటి తరానికి, ప్రజలందరికీ వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు నల్లా నర్సింహులు 33వ వర్ధంతి సభను తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆచార్య పిల్లలమర్రి రాములు అధ్యక్షత వహించారు. ?సభలో ప్రముఖ వక్త టి.చిరంజీవులు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కేవలం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగింది మాత్రమే కాదని, అది వెట్టిచాకిరి వ్యవస్థకు, భూస్వామ్య ఆధిపత్యాలకు వ్యతిరేకంగా కొనసాగిన చారిత్రక ఉద్యమమని స్పష్టం చేశారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రాణాలకు తెగించి పోరాడిన వీరులను కేవలం కులాలకు పరిమితం చేయడం ఎంతమాత్రం సరికాదని, వారిని సమాజ హితం కోసం పోరాడిన యోధులుగా గౌరవించాలని పిలుపునిచ్చారు. ?ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, నల్లా నర్సింహులు కుమార్తె చింతకింది అరుణ, తెలుగు అకాడమీ చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకటనారాయణ, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, హ్యాండ్‌లూమ్ కార్పొరేషన్ చైర్మన్ దూడం వెంకటరమణ, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి తదితరులు పాల్గొని ప్రసంగించారు. కడవెండి, పాలకుర్తి గ్రామాల నుంచి భారీ సంఖ్యలో



ప్రజలు, ఉద్యమ సానుభూతిపరులు హాజరై సభను విజయవంతం చేశారు. చివరగా తెలంగాణ చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు వనం శాంతికుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.



కొంపల్లిలో అయ్యప్ప స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం

ప్రతిష్ఠ కార్యక్రమ ఆహ్వాన పత్రికను అందుకున్న బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్ సాగర్

కొంపల్లి, నవంబర్ 06 :
కొంపల్లిలో శ్రీశ్రీశ్రీ హరిహరసుత అయ్యప్ప స్వామి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను శుక్రవారం బీజేపీ కొంపల్లి డివిజన్ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్ సాగర్ అందుకున్నారు. జెంద కుమార్ గురుస్వామి స్వయంగా ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా సతీష్ సాగర్ మాట్లాడుతూ, దేవాలయ నిర్మాణంలో జెంద కుమార్ గురుస్వామి చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అయ్యప్ప స్వామి అనుగ్రహంతో ఆలయ నిర్మాణం సాకారమవడం సంతోషకరమన్నారు. గురుస్వామికి, కొంపల్లి బీజేపీ అయ్యప్ప స్వామి భక్త సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు.దేవాలయ నిర్మాణంలో భాగస్వామ్యం కల్పించడంతో పాటు, ప్రతిష్ఠ మహోత్సవానికి ఆహ్వానించినందుకు నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎండిన పంటలు.. కన్నీటి పర్యంతమైన రైతులు! రేవంత్ సర్కార్‌పై హరీశ్‌రావు సమరం

రైతులకు హరీశ్‌రావు భరోసా..
రేవంత్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

నర్సాపూర్, నవంబర్ 06



లఓకరెంటు సరఫరా, సాగునీటి కొరతతో చేతికొచ్చిన వరి పంటలు ఎండిపోయాయని మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీశ్‌రావు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో కలిసి శుక్రవారం పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నష్టాన్ని వివరించిన రైతులు కన్నీటి పర్యంతమయ్యారు.సకాలంలో విద్యుత్ సరఫరా లేక తన ఏడు ఎకరాల వరి పంట పూర్తిగా ఎండిపోయిందని కుమార్ అనే రైతు హరీశ్‌రావు ఎదుట వాపోయాడు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నాణ్యమైన విద్యుత్‌తో రెండు పంటలు పండించుకున్నామని, ప్రస్తుతం విద్యుత్ సరఫరాపై స్పష్టత లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. రైతుబంధు పూర్తిస్థాయిలో అందలేదని, రుణమాఫీ కూడా చాలామందికి జరగలేదని ఆరోపించారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ రైతులు అధైర్యపడవద్దని, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని భరోసా ఇచ్చారు. ఎండిపోయిన ప్రతి ఎకరానికి నష్టపరిహారం చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న రైతుబంధు నిధులు విడుదల చేయాలని, అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు.



రాయగిరి జడ్పీ ఉన్నత పాఠశాలలో 'భవిత' క్రీడా పోటీలు

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల ప్రతిభను ప్రోత్సహించాలి

క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఆత్మవిశ్వాసానికి తోడ్పడతాయి: కలెక్టర్ అనురాగ్ జయంతి

నవంబర్ 06, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, రాయగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సమగ్ర శిక్షా 'భవిత' కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా దినోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పిల్లలను ప్రోత్సహిస్తూ వారి వికాసానికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులు, భవిత కేంద్రాల సిబ్బందిని ఆయన అభినందించారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించి, వారిని ఉత్సాహపరిచారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, భవిత కేంద్రాల ఐఈఆర్పీ లు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై దారి దోపిడీలకు చెక్..అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

సంగారెడ్డి జిల్లాలో మూడు, కర్ణాటకలో ఒక దోపిడీ కేసు ఛేదన.. మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితులు అరెస్ట్
నకిలీ తుపాకీ, రెండు కత్తులు, ద్విచక్ర వాహనం స్వాధీనం.. మరో నిందితుడి కోసం గాలింపు



సంగారెడ్డి, నవంబర్ 06


జాతీయ రహదారిపై వరుస దారి దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను సంగారెడ్డి జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. సంగారెడ్డి జిల్లాలో నమోదైన మూడు దారి దోపిడీ కేసులతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా హుమ్నాబాద్‌లో జరిగిన మరో దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.జిల్లాలో వరుస దారి దోపిడీలకు పాల్పడుతున్న నిందితులను పట్టుకునేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు నేర పరిశోధన విభాగం, జహీరాబాద్ ఉపవిభాగం, సదాశివపేట పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నిఘా కెమెరాల చిత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం, ఇతర ఆధారాల సహాయంతో దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో చిరాగ్‌పల్లి, సదాశివపేట, కోహీర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన మూడు దోపిడీలతో పాటు హుమ్నాబాద్‌లో జరిగిన మరో ఘటనలో నిందితుల ప్రమేయాన్ని గుర్తించారు.

కార్లలో ఒంటరిగా ఉన్నవారే లక్ష్యం

మహారాష్ట్రలోని లాతూర్, పూణే, బారామతి ప్రాంతాలకు చెందిన నిందితులు ముఠాగా ఏర్పడి రాత్రి వేళల్లో జాతీయ రహదారులపై ప్రయాణిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో రహదారి పక్కన నిలిపిన కార్లను లక్ష్యంగా చేసుకునేవారు. తమ ద్విచక్ర వాహనాన్ని కొంత దూరంలో నిలిపి, ముఖాలు గుర్తుపట్టకుండా నల్లని టోపీలు ధరించి కార్ల వద్దకు వెళ్లేవారు. నకిలీ తుపాకీ, కత్తులతో కార్లలోని వ్యక్తులను బెదిరించి బంగారు ఆభరణాలు, నగదును బలవంతంగా దోచుకునేవారు.అనంతరం ద్విచక్ర వాహనంపై మహారాష్ట్రలోని లాతూర్‌కు పారిపోయి, దోచుకున్న బంగారు ఆభరణాలను తమకు పరిచయమున్న వ్యక్తి ద్వారా బంగారు దుకాణంలో విక్రయించి డబ్బులు పంచుకునేవారు.

మాడ్గి కూడలి వద్ద పోలీసులకు చిక్కిన నిందితులు

మరోసారి తెలంగాణలో దారి దోపిడీలకు



పాల్పడేందుకు ముగ్గురు నిందితులు మహారాష్ట్ర నుంచి నంబరు పలక లేని నీలం రంగు యమహా ఆర్15 ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. వారి వెంట నల్లని ముఖముసుగులు, ఉన్ని దుస్తులు, రెండు కత్తులు ఉండగా, మరో నిందితుడు నకిలీ తుపాకీని దాచిపెట్టుకున్నాడు.చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాడ్గి కూడలి వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో సంగారెడ్డి జిల్లాలో జరిగిన మూడు దారి దోపిడీలు, హుమ్నాబాద్‌లో జరిగిన మరో దోపిడీలో తమ ప్రమేయాన్ని వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

నిందితుల వివరాలు

మొదటి నిందితుడు హసన్ సమీర్ షేక్ ఏ హసన్ జమీర్ షేక్ (32). మహారాష్ట్రలోని పూణే జిల్లా బారామతి తాలూకా తాండూల్వాడి ప్రాంతంలో కోళ్ల మాంసం విక్రయించే దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతని స్వస్థలం లాతూర్ జిల్లా చాకూర్ తాలూకా నాలేగావ్ గ్రామం.రెండో నిందితుడు సంతోష్ సెగర్ ధగుడు (35). పూణే జిల్లా ఇందాపూర్ తాలూకా గొథండి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ.మూడో నిందితుడు నౌషాద్ జాకీర్ సయ్యద్ ఏ నౌషాద్ (24). పూణే జిల్లా ఇందాపూర్ తాలూకా లోణి గ్రామంలో నివాసం ఉంటూ చమురు సంస్థలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతని స్వస్థలం సోలాపూర్ జిల్లా కర్మాలా తాలూకా చికల్తాన్ గ్రామం.నాలుగో నిందితుడు రఫీక్ షంషోద్దీన్ షేక్ (28). లాతూర్ పట్టణంలోని మాణిక్రావ్ జాదవ్ నగర్, ఖడ్గావ్ రోడ్డుకు చెందినవాడు. ఇతను పరారీలో ఉన్నాడు.

గతంలోనూ పలు నేరాలు

ప్రస్తుతం అరెస్టయిన మొదటి నుంచి మూడో నిందితుల వరకు జాతీయ రహదారిపై జరిగిన నాలుగు దారి దోపిడీ కేసుల్లో తమ ప్రమేయాన్ని వెల్లడించినట్లు ఎస్పీ తెలిపారు. మొదటి నిందితుడు హసన్ సమీర్ షేక్‌పై మహారాష్ట్రలోని నాందేడ్, లాతూర్ జిల్లాల్లో దోపిడీ, దొంగతనం తదితర నేరాలకు సంబంధించి గతంలో పలు కేసులు నమోదయ్యాయి.రెండో నిందితుడు సంతోష్ సెగర్ ధగుడుపై రంజన్‌గావ్, బెల్వాండి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆయుధ చట్టం, దోపిడీకి సంబంధించిన కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. పరారీలో ఉన్న నాలుగో నిందితుడు రఫీక్ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

స్వాధీనం చేసుకున్న వస్తువులు

నేరాలకు ఉపయోగించిన నంబరు పలక లేని నీలం రంగు యమహా ఆర్15 వాహనం, నకిలీ తుపాకీ, కొబ్బరి బొండం నరికే కత్తి, చెక్క పిడితో ఉన్న మరో కత్తి, రెండు నల్లని టోపీలు, మూడు ఉన్ని దుస్తులు, ఒక సంచి, రెండు ఆధార్ కార్డులు, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.దోచుకున్న బంగారు ఆభరణాలను లాతూర్‌లో విక్రయించినట్లు విచారణలో వెల్లడైందని, వాటి విక్రయానికి సహకరించిన వ్యక్తి, బంగారు దుకాణం వివరాలపై దర్యాప్తు కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు.

రాత్రి ప్రయాణికులకు పోలీసుల సూచనలు


రాత్రి వేళల్లో ప్రయాణించే వారు నిర్మానుష్య ప్రాంతాల్లో వాహనాలను నిలిపి ఉంచరాదని ఎస్పీ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పెట్రోలు బంకులు, భోజనశాలలు, హోటళ్లు వంటి జనసంచారం ఉన్న సురక్షిత ప్రాంతాల్లోనే వాహనాలను నిలిపి ఉంచాలని తెలిపారు.వాహనం చెడిపోవడం, చక్రం గాలి తగ్గడం లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో వెంటనే అత్యవసర సహాయ నంబరు 112 లేదా జాతీయ రహదారి గస్తీ విభాగం ఉచిత ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.నేరాల నియంత్రణలో భాగంగా జిల్లా పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని, ప్రజల భద్రతకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. కేసులను ఛేదించడంలో సమర్థవంతంగా పనిచేసిన నేర పరిశోధన విభాగం, జహీరాబాద్ ఉపవిభాగం, సదాశివపేట పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు.

సంగారెడ్డి జిల్లా ప్రజల భద్రతే మా ప్రథమ కర్తవ్యం.
పరితోష్ పంకజ్, ఐపీఎస్, జిల్లా ఎస్పీ

లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ఉట్కూరి అశోక్ గౌడ్ ప్రత్యేక పూజలు

రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థన
ఘనంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

నవంబర్ 06,
యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆలయానికి చేరుకున్న ఆయన, స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. స్వామివారి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలు,



సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల రైతులు, పాడి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా సకాలంలో అనుకూలమైన వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, మూగజీవాలకు పుష్కలంగా పశుగ్రాసం లభించాలని స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు. రైతు బాగుంటేనే పల్లెలు బాగుంటాయని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితోనే దేశం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి అన్నదాత ముఖంలో చిరునవ్వు, యువత జీవితాల్లో ఉన్నతమైన ప్రగతి, ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చయ్య, పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్ కుమార్, మండల అధ్యక్షులు మహేశ్వరి సత్యం, భువనగిరి మండల అధ్యక్షులు సురేష్ రెడ్డి, బీబీనగర్ మండల అధ్యక్షులు సదానంద్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి సురేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మహేష్, నాయకులు గోపగంజ్ ప్రసాద్ వంశీ, రుద్రాక్ష నవీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భారత్‌ను బంగ్లాదేశ్, నేపాల్‌లా మార్చాలనుకుంటున్నారా?

కాంగ్రెస్, రాహుల్ గాంధీని ప్రశ్నించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

నవంబర్ 06, హైదరాబాద్

దేశంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసనలపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శలు గుప్పించారు. భారత్‌ను నేపాల్, బంగ్లాదేశ్‌లా మార్చాలని చూస్తున్నారా అంటూ కాంగ్రెస్ పార్టీతో పాటు రాహుల్ గాంధీని ప్రశ్నించారు. జార్ఖండ్ మంత్రి ఇర్ఫాన్ అన్సారీ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ ఉద్దేశాలను వెల్లడిస్తున్నాయని ఆయన ఆరోపించారు.భారత్ పరిస్థితి నేపాల్, బంగ్లాదేశ్‌ల కంటే మరింత దారుణంగా మారుతుందంటూ ఇర్ఫాన్ అన్సారీ వ్యాఖ్యానించారని రామచందర్ రావు పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఎన్నికల సంస్కరణలను కాంగ్రెస్ పార్టీ కేవలం సాకులుగా ఉపయోగించుకుంటోందని విమర్శించారు. బుజ్జగింపు రాజకీయాలతో దేశాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ మంత్రి ప్రస్తావించిన 40 లక్షల మంది ఎవరు? వారు బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ చొరబాటుదారులా? అని ప్రశ్నించారు.దేశంలోని ప్రతి అక్రమ చొరబాటుదారుడిని గుర్తించి బహిష్కరించాలన్నదే బీజేపీ సంకల్పమని రామచందర్ రావు తెలిపారు.



మరోవైపు అక్రమ చొరబాటుదారుల మద్దతుతో దేశంలో అధికార మార్పిడి తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ కలలు కంటోందని ఆరోపించారు.

40 ఏళ్లుగా నివాసం.. ఇళ్ల తొలగింపునకు బ్రేక్!
పేదలకు 45 రోజుల గడువు ఇప్పించిన ఆదర్శ్ రెడ్డి

ఓల్డ్ ఎం.ఐ.జి.లో పేదల ఇళ్ల తొలగింపు నిలిపివేతకు కృషి

రామచంద్రపురం, నవంబర్ 06

ఓల్డ్ ఎం.ఐ.జి., శేరిలింగంపల్లి ప్రాంతంలో గత 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేద కుటుంబాల ఇళ్ల తొలగింపు చర్యలను పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి అడ్డుకున్నారు. రైల్వే పోలీసులు, అధికారులు ఇళ్ల తొలగింపునకు వచ్చిన విషయం తెలుసుకున్న ఆయన వెంటనే అక్కడికి చేరుకుని చర్యలను నిలిపివేయాలని కోరారు.ఎన్నో ఏళ్లుగా అక్కడే నివసిస్తున్న పేద కుటుంబాలకు ప్రత్యామ్నాయ నివాసాలు కల్పించకుండా ఇళ్లను తొలగిస్తే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని అధికారులకు వివరించారు. అనంతరం రైల్వే



అధికారుల సమక్షంలో స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. బాధిత కుటుంబాలకు ప్రత్యామ్నాయ నివాసాలు కల్పించేలా చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.నివాసితులకు ఇబ్బందులు



కలగకుండా మానవతా దృక్పథంతో కనీసం 45 రోజుల గడువు ఇవ్వాలని రైల్వే అధికారులను కోరారు. దీనిపై స్పందించిన రైల్వే సిబ్బంది 45 రోజుల వరకు వేచి ఉంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, భాస్కర్ ముదిరాజ్, గిరి, నర్సింహ, సంపత్ గౌడ్, చిన్న, తిలావత్, రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

300 మందికి పైగా రక్తదానం..
ఒక్కో రక్తపు బొట్టు ఓ ప్రాణానికి భరోసా: అరికెపూడి గాంధీ

శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం ప్రారంభం

శేరిలింగంపల్లి, నవంబర్ 06

మియాపూర్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినం సందర్భంగా నిర్వహించిన మెగా ఉచిత రక్తదాన శిబిరాన్ని పీఏసీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ప్రారంభించారు. శ్రీ చైతన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ రక్తనిధి సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహించాయి. మియాపూర్ సీఐ జయరాం, మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి, శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం రవికుమార్‌తో కలిసి గాంధీ కేక్ కట్ చేసి ఝాన్సీ లక్ష్మీబాయికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ విద్యారంగంలో డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి అందిస్తున్న సేవలు అభినందనీయమని,



ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయికి తీర్చిదిద్ది వారి జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. ఆమె జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి పైగా రక్తదానం చేయడం అభినందనీయమని తెలిపారు.అన్ని దానాల్లో రక్తదానం గొప్పదని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. తలసేమియా బాధితులు, గర్భిణులు, ప్రమాదాల్లో గాయపడిన వారికి నిరంతరం రక్తం



అవసరమవుతుందని, ప్రతి రక్తపు బొట్టు విలువైనదని అన్నారు. రక్తదానంపై ఉన్న అపోహలను వీడి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్తర్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల హక్కుల పరిరక్షణకు కొత్త అడుగు..
ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటుపై హర్షం

సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన మెగావత్ సురేష్ నాయక్

పటాన్‌చెరు, నవంబర్ 06 :

తెలంగాణలో ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని పటాన్‌చెరు నియోజకవర్గ ఎస్టీ సెల్ నాయకుడు మెగావత్ సురేష్ నాయక్ అన్నారు. ఇప్పటివరకు ఉమ్మడి ఎస్సీ, ఎస్టీ కమిషన్ కొనసాగుతున్న నేపథ్యంలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి, హక్కుల పరిరక్షణకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలనే నిర్ణయం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటుతో గిరిజనులు



ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యేకంగా గుర్తించి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాల్లో గిరిజనుల అభివృద్ధికి ఈ కమిషన్ దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనులందరికీ చేరేలా చర్యలు తీసుకోవడానికి కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయానికి, అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయమని సురేష్ నాయక్ అన్నారు. గిరిజనుల చిరకాల ఆకాంక్షలకు ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటుకు చొరవ చూపిన ముఖ్యమంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

స్టార్‌లింక్‌కు పోటీగా జియో, వన్‌వెబ్.. శాటిలైట్ ఇంటర్నెట్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్!

వినియోగదారులే తమకు నచ్చిన సంస్థను ఎంచుకోవచ్చు.. సేవల ప్రారంభానికి మరో రెండు కీలక దశలు

న్యూఢిల్లీ, నవంబర్ 06:

భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవల రంగంలోకి ప్రవేశించే అన్ని సంస్థలకు కేంద్ర ప్రభుత్వం స్వాగతం పలికింది. ఈ రంగంలో ఏ సంస్థ సేవలను వినియోగించుకోవాలనేది పూర్తిగా వినియోగదారుల నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేసింది. ధరలు, సేవల నాణ్యత, సౌకర్యాలు, అందించే విలువ ఆధారంగా ప్రజలు తమకు నచ్చిన సంస్థను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. శాటిలైట్ కమ్యూనికేషన్ రంగంలో వినియోగదారుడే కీలకమని పేర్కొన్నాయి.ప్రస్తుతం భారత్‌లో రిలయన్స్ జియో, వన్‌వెబ్, ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ సంస్థలకు శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలకు సంబంధించి లైసెన్సులు మంజూరయ్యాయి. ఈ అనుమతుల ప్రక్రియ పారదర్శకంగా జరిగినట్లు కేంద్రం తెలిపింది. తొలుత వన్‌వెబ్, ఆ తర్వాత జియో, చివరగా స్టార్‌లింక్ భద్రతా నిబంధనలకు సంబంధించిన పత్రాలను సమర్పించాయి. లైసెన్సులు



పొందిన సంస్థలు తమ సాంకేతిక సామర్థ్యాన్ని నిరూపించుకోవడంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది.అయితే దేశవ్యాప్తంగా శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు ప్రారంభం కావడానికి ఇంకా రెండు కీలక దశలు పూర్తికావాల్సి ఉంది. మొదటగా స్పెక్ట్రమ్ కేటాయింపు విధానం, దాని ధరపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. రెండోది.. మూడు సంస్థలు నిర్దేశించిన భద్రతా నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు చేయాలి. ఈ ప్రక్రియలు పూర్తయితే దేశంలో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాలకు కూడా వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు చేరే అవకాశం ఉండటంతో డిజిటల్ రంగంలో కొత్త మార్పులకు మార్గం సుగమం కానుంది.



తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శిగా కాపుల నాగరాజు ఎన్నిక

డిసెంబర్ 9న చలో హైదరాబాద్ సభను విజయవంతం చేయాలి: పూనెం వరప్రసాద్

చర్ల, నవంబర్ 06:

తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన కాపుల నాగరాజు, ఆయన సతీమణిని చర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. శుక్రవారం కేశవపురం గ్రామంలో తుర్రం ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సన్నాహక సమావేశంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్ మాట్లాడుతూ డిసెంబర్ 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ భారీ బహిరంగ సభకు చర్ల మండలంలోని ప్రతి గూడెం నుంచి ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల భూములు, హక్కులు, రిజర్వేషన్లు, చట్టాల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ ఆదివాసీల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పూనెం రవికిరణ్, ప్రధాన కార్యదర్శి కోరం బిక్షపతి, పలువురు నాయకులు, సర్పంచులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో కల్తీపాల మాఫియా గుట్టురట్టు..
100 లీటర్ల కల్తీ పాలు స్వాధీనం!

పాల నిల్వ కోసం హైడ్రోజన్ పెరాక్సైడ్ వినియోగం..

తయారీ కేంద్రాన్ని మూసివేసిన ఎస్ఓటీ పోలీసులు

హైదరాబాద్, నవంబర్ 06 :

హైదరాబాద్ శివారులో కల్తీపాల తయారీ దందా వెలుగులోకి వచ్చింది. ఇబ్రహీంపట్నం మండలం పోచారం కేంద్రంగా కల్తీపాలను తయారు చేసి నగరంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్న ముఠా గుట్టును స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్ఓటీ) పోలీసులు రట్టు చేశారు. కల్తీపాల తయారీ, సరఫరా జరుగుతోందన్న పక్కా సమాచారంతో పోలీసులు సంబంధిత కేంద్రంపై దాడులు నిర్వహించారు. అనధికారికంగా నిర్వహిస్తున్న తయారీ కేంద్రాన్ని మూసివేశారు.ఈ తనిఖీల్లో సుమారు 100 లీటర్ల కల్తీపాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాలను నిల్వ ఉంచేందుకు, వాటి రంగు మారకుండా ఉండేందుకు ఉపయోగిస్తున్నట్లు అనుమానిస్తున్న ఒక లీటర్ హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను కూడా గుర్తించారు. ఈ అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న అండె శ్రీశైలం అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ప్రాథమిక విచారణలో పోచారంలో తయారవుతున్న కల్తీపాలను నగరంలోని పలు ప్రాంతాలకు నిత్యం సరఫరా చేస్తున్నట్లు వెల్లడైంది. ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే కల్తీ వ్యాపారాలపై అధికారులు తీవ్రంగా స్పందించారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహార పదార్థాల కల్తీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.





మదర్సాలో బాలుడిపై లైంగిక వేధింపుల ఆరోపణలు.. మౌల్సాబ్‌పై పోక్సో కేసు!

11 ఏళ్ల బాలుడిని బెదిరించినట్లు ఫిర్యాదు.. మాదన్నపేట పోలీసుల దర్యాప్తు

హైదరాబాద్, నవంబర్ 06 :
హైదరాబాద్ పాతబస్తీలో మైనర్ బాలుడిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపింది. మాదన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుర్మగూడ ఫాతిమా మసీదు మొదటి అంతస్తులో నిర్వహిస్తున్న బాబా షరీఫుద్దీన్ మదర్సాలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. అక్కడ అరబిక్ బోధించే మౌల్సాబ్ 11 ఏళ్ల బాలుడి పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు బాలుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.బాధిత బాలుడు తరగతులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా తిరిగి పై అంతస్తుకు పిలిచి, ఓ గదిలోకి తీసుకెళ్లి అసభ్యకరమైన వీడియోలు చూపించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం బాలుడిపై లైంగిక వేధింపులకు పాల్పడి, ఈ విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించినట్లు ఆరోపించారు. ఇంటికి చేరుకున్న బాలుడు తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు.తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మాదన్నపేట పోలీసులు నిందితుడిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 127(2), 351(2), పోక్సో చట్టంలోని సెక్షన్లు 8, 10 కింద కేసు నమోదు చేశారు. బాధిత బాలుడి వాంగ్మూలం నమోదు చేసేందుకు ప్రత్యేక భరోసా కేంద్రానికి తరలించి, తదుపరి దర్యాప్తు చేపట్టారు. బాలుడి భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఎస్ఐ తఖియుద్దీన్

నవంబర్ 06,
యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి
:యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ తఖియుద్దీన్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలో చేపట్టిన వాహన తనిఖీల్లో భాగంగా చల్లూరు గ్రామానికి చెందిన గుంటి నవీన్ తన ట్రాక్టర్‌తో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. దీంతో నిందితుడిపై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక రవాణా చేయాలనుకునే వారు ప్రతి బుధవారం అవసరమైన పత్రాలను సమర్పించి తహశీల్దార్ నుంచి ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. కేవలం అనుమతి పత్రంలో పేర్కొన్న ట్రాక్టర్, డ్రైవరుతో మాత్రమే, సూచించిన వాగు నుండి ఇసుకను తరలించాలని స్పష్టం చేశారు. ఎవరైనా అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





రఘునాథపురం వేంకటేశ్వరుడిని దర్శించుకున్న దాత మదన్ మోహన్ దంపతులు

నవంబర్ 06,
యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం రఘునాథపురంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ఆలయ దాతలు, హైదరాబాద్ వాస్తవ్యులు మదన్ మోహన్, చంద్రభాగ దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శుక్రవారం ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి విచ్చేసిన వారు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ?అనంతరం ఆలయ అర్చకులు చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు దాత దంపతులను శేషవస్త్రాలు, పూలమాలలతో సత్కరించి వేదాశీర్వచనం చేశారు. స్వామివారి జ్ఞాపికతో పాటు తీర్థప్రసాదాలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

మియాపూర్ ప్రభుత్వ భూములు అమ్మొద్దు..
పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాల్సిందే!

ముజఫర్ అహ్మద్ నగర్, స్టాలిన్ నగర్ ప్రజలకు న్యాయం చేయాలి.. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎంసీపీఐ(యు) ధర్నా

శేరిలింగంపల్లి, నవంబర్ 06

మియాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 100 పరిధిలో ఉన్న ముజఫర్ అహ్మద్ నగర్, స్టాలిన్ నగర్ బస్తీల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు ఇంటి పట్టాలు జారీ చేయాలని, సర్వే నంబర్లు 100, 101లోని మిగులు ప్రభుత్వ భూమిని ప్రజా అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేస్తూ ఎంసీపీఐ(యు) ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు.ఈ సందర్భంగా ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వనం సుధాకర్ మాట్లాడుతూ.. మియాపూర్ సర్వే నంబర్లు 100, 101 పరిధిలోని 550 ఎకరాల భూమిని



విక్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు. ప్రభుత్వ భూములను ప్రజా అవసరాలకు వినియోగించకుండా విక్రయించడం వల్ల పేదలకు నష్టం జరుగుతుందని ఆరోపించారు. సర్వే నంబర్ 100లో గత 30 ఏళ్లకు పైగా నివాసం ఉంటూ 68 గజాల స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేద కుటుంబాలకు చట్టబద్ధత కల్పించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్లు 505, 166, 58 కింద ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. గత ప్రభుత్వాలు పట్టాల జారీ విషయంలో కాలయాపన చేశాయని, ప్రస్తుత ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు.అనంతరం ఎంసీపీఐ(యు) గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి తుడుం అనిల్ కుమార్ మాట్లాడుతూ.. సర్వే నంబర్లు 100, 101లోని ప్రభుత్వ భూమిని పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, డిగ్రీ కళాశాల, 200 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, జూనియర్ కళాశాల, మినీ స్టేడియం, మార్కెట్ యార్డు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల విక్రయానికి ప్రయత్నిస్తే ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యు) నాయకులు కుంభం సుకన్య, తాండ్ర కళావతి, వి. తుకారాం నాయక్, పి. భాగ్యమ్మ, కర్ర దానయ్య, ఇస్లావత్ దశరత్ నాయక్, జి. శివాని, లలిత, నిమ్మిక నాగభూషణం, ఎం.డి. సుల్తానా బేగం, బి. అరుణ, దప్పు రాజు, రాములు, కె. మాధవ, అమీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్ ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేలా చర్యలు..
సర్వీస్ రోడ్డు విస్తరణకు అనుమతులపై గాంధీ సమీక్ష

నడిగడ్డ తండా రోడ్లు, భూగర్భ మురుగునీటి పైప్‌లైన్ పనుల పూర్తికి కృషి

శేరిలింగంపల్లి, నవంబర్ 06

మియాపూర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డ తండా, సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వివేకానంద నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ దక్షిణ విభాగం ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు, తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ నడిగడ్డ తండాలో అసంపూర్తిగా ఉన్న రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయడంతో పాటు



భూగర్భ మురుగునీటి పైప్‌లైన్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా మియాపూర్ మెట్రో పిల్లర్ నంబర్ 600 నుంచి మెట్రో స్టేషన్ వరకు సర్వీస్ రోడ్డు విస్తరణలో భాగంగా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ఆధీనంలోని స్థలంలో రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు పనులు మధ్యలో నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సర్వీస్ రోడ్డు అందుబాటులోకి వస్తే ప్రధాన రహదారిపై ట్రాఫిక్ తగ్గడంతో పాటు ప్రయాణ సమయం, ఇంధనం ఆదా అవుతాయని పేర్కొన్నారు.నడిగడ్డ తండా నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బొల్లారం రహదారి పక్కన మురుగునీరు నిల్వ ఉండటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భూగర్భ మురుగునీటి పైప్‌లైన్ నిర్మాణానికి అనుమతులు లభిస్తే పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. నడిగడ్డ తండాలో అసంపూర్తిగా ఉన్న రోడ్లు, భూగర్భ మురుగునీటి పైప్‌లైన్ పనులను పూర్తి చేసి ఎన్నో ఏళ్లుగా నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. గాంధీ ప్రస్తావించిన అంశాలపై సానుకూలంగా స్పందించినట్లు ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు తెలిపారు. ఈ సమావేశంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఎస్ఈ శ్రీకాంతిని, డీఈ బాలమురళి, ఏఈ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల అమ్మకాలకు బ్రేక్ వేయాలి.కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే మాధవరం ఫైర్!

కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ భూములను విక్రయించొద్దు.. భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలి

కేపీహెచ్‌బీ, నవంబర్ 06 :
కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల అమ్మకాలపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్ర విమర్శలు చేశారు. ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భూములను విక్రయానికి పెట్టడం దురదృష్టకరమని అన్నారు.గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ ప్రాంతాల్లో సుమారు రూ.2,000 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మహిళా పార్కులు, చిన్నారుల పార్కులు, ఇండోర్ స్టేడియాలు, క్రీడా మైదానాలు వంటి ప్రజోపయోగ సదుపాయాలను



ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. అలాంటి భూములను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మకానికి పెట్టడం సరికాదని విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.2,000 కోట్ల విలువైన భూములను విక్రయానికి పెట్టారని ఆరోపించారు. గృహ నిర్మాణ మండలి ఉపాధ్యక్షుడు గౌతమ్ వ్యవహారశైలిపై కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భూములను విక్రయిస్తే రాబోయే తరాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గతంలో మియాపూర్ భూములను కాపాడేందుకు కేసీఆర్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని గుర్తుచేశారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేషన్ దుకాణంలో ఆకస్మిక తనిఖీ.. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే శ్రీగణేష్

సన్నబియ్యం నాణ్యత, సరుకుల పంపిణీపై ఆరా.. అక్రమాలకు తావులేకుండా చూడాలని డీలర్‌కు సూచన

సికింద్రాబాద్, నవంబర్ 06

కంటోన్మెంట్ నియోజకవర్గంలోని 5వ వార్డు పరిధిలోని శేషాచల కాలనీలో ఉన్న తెలంగాణ రాష్ట్ర చౌక ధరల దుకాణాన్ని శుక్రవారం ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాతీయ ఆహార భద్రతా పథకం కింద జరుగుతున్న రేషన్ సరుకుల పంపిణీ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా రేషన్ కోసం వచ్చిన లబ్ధిదారులతో, ముఖ్యంగా మహిళలతో నేరుగా మాట్లాడి బియ్యం నాణ్యత, ఇతర నిత్యావసర సరుకుల పంపిణీ, ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు సన్నబియ్యం పంపిణీ చేయడం, అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు అందించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ఎదురైన ఇబ్బందులు తగ్గాయని, నాణ్యమైన సన్నబియ్యం అందడం ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలనే లక్ష్యంతో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నామని అన్నారు. రేషన్ పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా,



లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని దుకాణం నిర్వాహకుడికి సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

రాత్రివేళ ప్లాస్టిక్ కంపెనీ నుంచి భరించలేని దుర్వాసన..ప్రజారోగ్యంపై ఆందోళన!

మీనాక్షి ఎంటర్‌ప్రైజెస్‌ను గ్రామం నుంచి తరలించాలని మల్లాపూర్ తాండ గ్రామస్తుల డిమాండ్







షాద్‌నగర్, నవంబర్ 06 :
కొత్తూరు మండలం మల్లాపూర్ తాండ గ్రామపంచాయతీ పరిధిలోని మీనాక్షి ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ నుంచి వెలువడుతున్న దుర్వాసనతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం ప్లాస్టిక్ దానా తయారీ పేరుతో కంపెనీని ఏర్పాటు చేశారని, ప్రారంభంలో ప్లాస్టిక్ కటింగ్ మాత్రమే చేస్తామని యాజమాన్యం చెప్పినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం కంపెనీలో జరుగుతున్న కార్యకలాపాల వల్ల తమ ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రతిరోజూ రాత్రి వేళల్లో కంపెనీ పరిసర ప్రాంతాల్లో తీవ్రమైన దుర్వాసన వ్యాపిస్తోందని, దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు సహా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కంపెనీ వద్దకు వెళ్లిన గ్రామస్తులు తమ నిరసన వ్యక్తం చేశారు. కంపెనీని గ్రామ పరిధి నుంచి వెంటనే తరలించాలని కోరుతూ గ్రామ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. కంపెనీని పరిశీలించిన సమయంలో కూడా తీవ్ర దుర్వాసన వచ్చినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కంపెనీ కార్యకలాపాలపై సమగ్ర విచారణ జరిపి, పర్యావరణ నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగుతున్నాయా? అనే అంశాలను పరిశీలించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందులు కలగకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు.

ఓల్డ్ బోయిన్‌పల్లిలో దోమల నివారణపై అవగాహన ర్యాలీ

డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన

నవంబర్ 06, ఓల్డ్ బోయిన్‌పల్లి

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోయిన్‌పల్లి సర్కిల్-3, ఓల్డ్ బోయిన్‌పల్లి 262వ డివిజన్‌లో దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు బ్యాంకు కాలనీ, శాంతినికేతన్ కాలనీలలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్‌వైజర్ స్వామి, ఏఏ షరీఫ్ ప్రజలకు దోమల వల్ల కలిగే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై వివరించారు.దోమల కాటు వల్ల డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా (బోదకాలు) వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వారు తెలిపారు. ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పాత టైర్లు, పగిలిన కుండలు, ప్లాస్టిక్ కప్పులు, కూలర్లలో నీరు పేరుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే--డ్రై డే' పాటిస్తూ నీటి నిల్వ పాత్రలను శుభ్రంగా కడిగి ఆరబెట్టాలని, నిద్రించే సమయంలో దోమతెరలు ఉపయోగించాలని, శరీరాన్ని పూర్తిగా కప్పే దుస్తులు ధరించాలని కోరారు.దోమల నివారణ కేవలం ప్రభుత్వానికో, మున్సిపాలిటీకో సంబంధించిన పని కాదని, ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కార్యక్రమంలో పేర్కొన్నారు. "పరిసరాల పరిశుభ్రతే దోమల నిర్మూలనకు తొలి అడుగు. నిల్వ నీటిని తొలగిద్దాం.. మలేరియా, డెంగ్యూను తరిమికొడదాం" అంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. మన ఇంటిని, వీధిని పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు.



కంటోన్మెంట్ పారిశుద్ధ్య కార్మికులకు దీపావళి మిఠాయిల పంపిణీ

సుమారు వెయ్యి మంది కార్మికులకు స్వీట్స్ అందజేసిన బానుక నర్మద మల్లిఖార్జున్

నవంబర్ 06, కంటోన్మెంట్

దీపావళి పండుగ సందర్భంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లిఖార్జున్ మిఠాయి డబ్బాలను పంపిణీ చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో, మేడ్చల్--మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ సూచన మేరకు శుక్రవారం 1వ వార్డు నుంచి 8వ వార్డు వరకు పనిచేస్తున్న సుమారు వెయ్యి మంది పారిశుద్ధ్య కార్మికులకు స్వీట్స్ అందజేశారు. ఈ సందర్భంగా బానుక నర్మద మల్లిఖార్జున్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. ఎండా, వానలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించే వారి సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. దీపావళి పండుగ సంతోషాలను వారితో పంచుకోవాలనే ఉద్దేశంతో ప్రతి కార్మికుడికి మిఠాయి డబ్బాలను అందజేసినట్లు పేర్కొన్నారు.పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల సంతోషం కోసం ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ఎనిమిది వార్డులకు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తల సహకారంతో ఈ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



పట్టభద్రుల హక్కుల సాధనకు ఓటు నమోదు కీలకం

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

స్కాట్ మండల అధ్యక్షుడు ఆకుల కోణార్క్ రావు

నవంబర్ 06,

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి: యాదాద్రి భువనగిరి జిల్లా, బీబీనగర్, నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (బి.స్కాట్) బీబీనగర్ మండల అధ్యక్షుడు, మదర్ థెరిస్సా స్కూల్స్ కరస్పాండెంట్ ఆకుల కోణార్క్ రావు పిలుపునిచ్చారు. ?స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పట్టభద్రులతో ఓటరు నమోదు ఆవశ్యకతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాసనమండలిలో పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగుల గళం, విద్యావంతుల హక్కులు సమర్థవంతంగా వినిపించాలంటే అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకోవడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు.?ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధమని, పట్టభద్రులంతా సంఘటితమై తమ హక్కును వినియోగించుకున్నప్పుడే సమస్యలకు సరైన పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా నిర్దేశిత గడువులోగా అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.





మాదకద్రవ్యాలపై అవగాహనకు సినీ అస్త్రం.. 'మత్తు సామ్రాజ్యం

ఆపరేషన్ బ్లాక్ థండర్' ట్రైలర్ ఆవిష్కరణ

సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ చేతుల మీదుగా పోస్టర్, ట్రైలర్ విడుదల

సంగారెడ్డి, నవంబర్ 06 :
మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో రూపొందించిన తెలుగు అవగాహన చిత్రం 'మత్తు సామ్రాజ్యం - ఆపరేషన్ బ్లాక్ థండర్' సినిమా ట్రైలర్, పోస్టర్‌ను సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ఆవిష్కరించారు. బీబీఎంఏ పోలీస్ ఈ:న్యూస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఝాన్సీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ బీబీఎంఏ పోలీస్ ఈ:న్యూస్ డైరెక్టర్లు, బృంద సభ్యులను అభినందించారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు సామాజిక బాధ్యతను చాటే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ సమాజానికి ఉపయోగపడే అవగాహన కార్యక్రమాలను కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీబీఎంఏ పోలీస్ ఈ:న్యూస్ డైరెక్టర్లు కె. శ్రీనివాస్ మూర్తి, కె. పద్మలత, ఎం. భాస్కర్, ఎస్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అఖిల భారత న్యాయవాదుల సంఘం కమిటీ ఏర్పాటు

21న సంగారెడ్డిలో 'రాజ్యాంగం మరియు న్యాయవాదులు, అంశంపై సెమినార్..

జహీరాబాద్, నవంబర్ 6, :
అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్) సంగారెడ్డి జిల్లా కన్వీనర్ ఆర్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం జహీరాబాద్ అడ్వకేట్ బార్ అసోసియేషన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 21వ తేదీన సంగారెడ్డిలో 'రాజ్యాంగం మరియు న్యాయవాదులు' అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సెమినార్‌కు న్యాయవాదులందరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆర్. శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.అనంతరం జహీరాబాద్ కోర్టు పరిధిలో అఖిల భారత న్యాయవాదుల సంఘం కన్వీనింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ కన్వీనర్‌గా అలిగి సందీప్ కుమార్‌ను, కో-కన్వీనర్లుగా ఏ. కార్తీక్ గౌడ్, ఏ. శేఖర్ రెడ్డి, మహేష్ కుమార్, బి. నరేష్, ఫహీముద్దీన్, తుల్జారాం యాదవ్‌లను ఎంపిక చేశారు.అలాగే కన్వీనింగ్ కమిటీ సభ్యులుగా బుజ్జమ్మ, ఇస్మాలప్ప, అవినాష్, నజియాలను ఎన్నుకున్నారు. న్యాయవాదుల హక్కులు, న్యాయవ్యవస్థలో రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం సంఘటితంగా పనిచేయాలని కోరారు.



ఒకే వేదికపై 5 వేల మంది నృత్య ప్రదర్శన

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

శ్రీగౌతమ్, జెనిసిస్ వాలీ పాఠశాలల విద్యార్థులకు గుర్తింపు

నవంబర్ 06,

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : ఘట్‌కేసర్ పరిధిలోని రాంపల్లిలో శివ నాట్య డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలీవుడ్ డాన్స్ రికార్డు కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఈ వేడుకలో సుమారు ఐదు వేల మంది విద్యార్థులు ఒకే వేదికపై పదిహేడు నిమిషాల పాటు నిరంతరాయంగా నృత్యం ప్రదర్శించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్నారు. ?ఈ మహా ప్రదర్శనలో శ్రీగౌతమ్ ఉన్నత పాఠశాల, జెనిసిస్ వాలీ పాఠశాలలకు చెందిన ముప్పై మంది విద్యార్థులు పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారు. అనంతరం రికార్డు సాధించిన విద్యార్థులకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ?వేలాది మంది విద్యార్థులు సమన్వయంతో కదం తొక్కుతూ నృత్యం చేయడంతో సభా ప్రాంగణం మార్మోగింది. ఈ రికార్డు సాధించి పాఠశాలలకు పేరు తెచ్చిన విద్యార్థులను కరస్పాండెంట్ మిర్యాల దుర్గాప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు లలిత కళల్లోనూ రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

ఆ చర్చలు ఆపండి..

బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ'పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమా బడ్జెట్, వీఎఫ్ఎక్స్ వంటి అంశాల కన్నా కథ, పాత్రల గురించే ప్రధానంగా చర్చ జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం ముంబైలో తన కొత్త చిత్రం 'మాతృభూమి: మే వార్ రెస్ట్ ఇన్ పీస్' ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సల్మాన్, మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా 'రామాయణ' సినిమాపై స్పందిస్తూ, "రామాయణం గురించి చర్చ జరగాల్సింది ఆ ఇతిహాసం గురించి, రాముడు, సీత, రావణుడి గురించి. అంతేకానీ దాని వీఎఫ్ఎక్స్, నిర్మాణ వ్యయం గురించి కాదు. సినిమా బడ్జెట్ రూ.4000 కోట్లు, గ్రాఫిక్స్ అంటూ జరుగుతున్న చర్చంతా అనవసరం" అని ఆయన స్పష్టం చేశారు. రామాయణ ఇతిహాసం, భారీ తారాగణం, ఆస్కార్ విజేతలు ఏ.ఆర్. రెహమాన్, హాన్స్ జిమ్మర్ సంగీతం ఈ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లాయి.ఇక తన కొత్త సినిమా 'మాతృభూమి' వివరాలను కూడా సల్మాన్ పంచుకున్నారు. మొదట 'గల్వాన్' అనే పేరుతో ఈ చిత్రాన్ని ప్రకటించారు. 2020 జూన్ 15న భారత్, చైనా సైనికుల మధ్య గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించారు. ఆ ఘర్షణలో 20 మంది భారత సైనికులు వీరమరణం పొందగా, చైనా వైపు కూడా ప్రాణనష్టం జరిగింది. దశాబ్దాల తర్వాత ఇరు దేశాల మధ్య జరిగిన అత్యంత తీవ్రమైన ఘర్షణ ఇదే.అయితే, ప్రభుత్వ ఒత్తిడి కారణంగా తన సినిమా స్క్రిప్ట్‌ను మార్చారంటూ వస్తున్న వార్తలను సల్మాన్ ఖాన్ ఖండించారు. అందులో ఎలాంటి నిజం లేదని ఆయన తేల్చి చెప్పారు.



SPORTS



చరిత్ర సృష్టించిన హసన్..
తొలి బంగ్లా బౌలర్‌గా రికార్డ్..

స్పోర్ట్స్ డెస్క్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహమూద్ అరుదైన ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో 27 ఏళ్ల హసన్ మహమూద్ తన సంచలన బౌలింగ్‌తో విండీస్ టాపార్డర్‌ను దెబ్బతీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో హసన్ 6 వికెట్లు సాధించాడు. దీంతో టెస్టుల్లో ఐదు లేదా అంతకంటే ఎక్కువసార్లు ఫైవ్ వికెట్ హాల్స్ నమోదు చేసిన తొలి బంగ్లాదేశ్ ఫాస్ట్ బౌలర్‌గా హసన్ చరిత్ర సృష్టించాడు.హసన్ టెస్టు కెరీర్‌లో ఇది ఐదో ఐదు వికెట్ల ప్రదర్శన కావడం విశేషం. గతంలో ఈ రికార్డు మాజీ పేసర్ షాహాదత్ హొస్సేన్ పేరిట ఉండేది. అతడు నాలుగు సార్లు టెస్టుల్లో ఐదు వికెట్ల ఘనత సాధించాడు. తాజా మ్యాచ్‌తో అతడి ఆల్‌టైమ్ రికార్డును హసన్ బద్దలు కొట్టాడు. కాగా హసన్ స్వదేశంలో ఐదు వికెట్లు తీయడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. అలానే ఆస్ట్రేలియా స్పిన్నర్ నాథన్ లియాన్ తర్వాత ఐదు వేర్వేరు దేశాల్లో ఒకే ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన రెండవ బౌలర్‌గా హసన్ నిలిచాడు. హసన్ గతంలో రావల్పిండి, చెన్నై, డార్విన్, అబుదాబి వేదికలపై తాజాగా సిల్హెట్‌లో ఐదు వికెట్లను సాధించాడు.ఇక ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 356 పరుగులకు ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో రెండో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లా దేశ్ మొదటి ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 88 పరుగులు చేసింది. క్రీజులో తౌహిద్ హ్రిదోయ్(29), ముష్ఫికర్ రహీమ్(19) ఉన్నారు.

సెహ్వాగ్ తనయుడి విధ్వంసం..
అండర్-19 ఆసియా కప్‌లో భారత్ శుభారంభం

అండర్-19 ఆసియా కప్‌లో భారత యువ జట్టు శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో నేపాల్‌పై 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ (70 నాటౌట్), కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీ (53 నాటౌట్) అర్ధశతకాలతో జట్టును గెలిపించారు. తొలుత బౌలర్లు నేపాల్‌ను 128 పరుగులకే కట్టడి చేయగా.. భారత ఓపెనర్లు లక్ష్యం చిన్నదిగా మార్చేశారు.టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్‌కు ఇషాన్ సూద్ అదిరిపోయే ఆరంభం అందించాడు. కొత్త బంతితో స్వింగ్ రాబడుతూ నేపాల్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. 10 ఓవర్లలో నాలుగు మెయిడిన్లతో కేవలం 18 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. దీంతో నేపాల్ టాపార్డర్ కుప్పకూలింది. దర్శ్ సోనార్ (43) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. ఆశిష్ లుహార్ (29)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. అయితే వీరి భాగస్వామ్యాన్ని బ్రేక్ చేశాక నేపాల్ లోయర్ ఆర్డర్ బ్యాటర్లు త్వరగానే పెవిలియన్ చేరారు. అర్జున్ రాజ్‌పుత్ 3, యశ్వీర్ గౌడ్ 2 వికెట్లు తీయడంతో నేపాల్ 42.3 ఓవర్లలో 128 పరుగులకు ఆలౌటైంది.స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆర్యవీర్, లక్ష్య రాయ్‌చందానీ అదిరిపోయే ఆరంభం ఇచ్చారు. తొలి కొన్ని ఓవర్లు ఆచితూచి ఆడిన ఈ జోడీ.. ఆ తర్వాత బౌండరీలతో విరుచుకుపడింది. ముఖ్యంగా నేపాల్ స్పిన్నర్లపై ఆర్యవీర్ ఎదురుదాడికి దిగాడు. క్రీజు బయటకు వచ్చి భారీ షాట్లు ఆడుతూ కేవలం 34 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. మరోవైపు లక్ష్య రాయ్‌చందానీ స్ట్రైక్ రొటేట్ చేస్తూ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. అతడు 59 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. చివరకు భారత్ 19.1 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 129 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది.ఈ గెలుపుతో 'గ్రూప్-ఏ'లో భారత్ రెండు పాయింట్లతో అగ్రస్థానానికి చేరింది. నెట్ రన్‌రేట్ 4.170గా నమోదైంది. భారత్ తన తదుపరి మ్యాచ్‌లో ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది.



నా భార్య క్యాన్సర్ పోరాటం..
నా జీవితాన్ని మార్చేసింది: కివీస్ ప్లేయర్

స్పోర్ట్స్ డెస్క్: రెండేళ్ల క్రితం తన భార్య క్యాన్సర్‌తో పోరాడిన తీరు తన జీవిత దృక్పథాన్ని మార్చిందని న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ బ్లెయిర్ టిక్నర్ అన్నాడు. ఆమె పోరాటం కారణంగా తన కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న ఒత్తిడిని ఇప్పుడు జయించి.. క్రికెట్‌ను ఆస్వాదించడంపై దృష్టి పెడుతున్నానని అతడు వెల్లడించాడు. తన సతీమణి 2024లో క్యాన్సర్ బారిన పడిందని, 8 నెలల పాటు చికిత్స తీసుకుందని తెలిపాడు. టిక్నర్ తన జీవితానికి భార్య సారానే హీరోనని చెప్పుకొచ్చాడు.రెండో వన్డేకు ముందు టిక్నర్ మీడియాతో మాట్లాడుతూ... 'నా జీవితంలోనూ ఎన్నో కష్టాలు ఉన్నాయి. ఈ కష్ట కాలంలో నా భార్య సారా, నాకు, నా కుటుంబం అండగా నిలిచింది. ఇప్పుడు నేను మళ్లీ నా క్రికెట్‌ను ఆస్వాదించడానికి కారణం ఆమె. కెరీర్ ప్రారంభంలో నేను చాలా ఒత్తిడికి గురయ్యేవాడిని. ఆ తర్వాత సారా క్యాన్సర్ చికిత్స సమయంలోనూ చాలా కష్టపడ్డాను. ఇప్పుడు ఆ దశను దాటి వచ్చాను. ఇప్పుడు క్రికెట్‌ను సరదాగా ఆడుతూ ఆస్వాదించాలనుకుంటున్నాను' అని తెలిపాడు.'క్రికెట్ నా జీవితంలో కీలకమైన భాగమే. కానీ అదే నా సర్వస్వం కాదనే విషయాన్ని తెలుసుకున్నాను. క్రికెట్ కంటే కుటుంబం, నా వ్యక్తగత జీవితం పెద్దదనే విషయాన్ని గ్రహించాను. మ్యాచ్ ముగిసిన తర్వాత నా కూతురు, నా సతీమణి కోసం ఇంటికి వెళ్లడం కంటే ఆనందం మరొకటి లేదు. అందుకే క్రికెట్‌కు కాస్త



ప్రాధాన్యం తగ్గించాను' అని టిక్నర్ పేర్కొన్నాడు. భారత్‌తో తొలి వన్డేలో టిక్నర్ అద్వితీయమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఆఖరి వికెట్‌గా క్రీజులోకి వచ్చి నాలుగు సిక్స్‌లు బాదిన సంగతి తెలిసిందే.టిక్నర్ 2019లో టీ20లలో న్యూజిలాండ్ తరపున అరంగేట్రం చేయగా, ఆ తర్వాత వరుసగా 2022, 2023లో వన్డే, టెస్ట్ జట్లకు కూడా ఎంపికయ్యాడు. 2024 ఏప్రిల్‌లో టిక్నర్ భార్య సారాకు లుకేమియా ఉన్నట్లు తెలిసింది. ఆమె ఎనిమిది నెలల పాటు క్యాన్సర్?కు చికిత్స తీసుకుంది. ఆ సమయంలో టిక్నర్ వ్యక్తిగతంగా పరిస్థితులు కష్టంగా మారాయి. టిక్నర్ ఇప్పటివరకు వన్డే ఫార్మాట్‌లో 19 మ్యాచ్‌లు ఆడాడు.

గంగూలీ పర్సనాలిటీ హక్కుల ఉల్లంఘన..
'దూస్రా' సినిమాకు ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు!

స్పోర్ట్స్ డెస్క్: టీమిండియా మాజీ దిగ్గజ కెప్టెన్ సౌరవ్ గంగూలీ వ్యక్తిగత హక్కుల ఉల్లంఘనకు సంబంధించి 'దూస్రా' సినిమాపై ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. గత నెలలో విడుదలైన ఈ చిత్రంలో గంగూలీ వ్యక్తిగత గుర్తింపును, పర్సనాని వాణిజ్యపరంగా దుర్వినియోగం చేశారని పేర్కొంటూ ఆయనతో పాటు 'లవ్ ఫిలింస్ ఎల్ఎల్పి'(ఈ సంస్థ గంగూలీ బయోపిక్‌ను నిర్మిస్తోంది) కోర్టును ఆశ్రయించాయి.ఈ వ్యాజ్యంపై ఇవాళ(శుక్రవారం) విచారణ జరిపిన జస్టిస్ తేజస్ కరియా.. 'దూస్రా' మూవీ ప్రాథమికంగా గంగూలీ పర్సనాలిటీ హక్కులను ఉల్లంఘించిందని స్పష్టం చేశారు. ఈ సినిమా కేవలం చారిత్రక సంఘటనల చిత్రీకరణకే పరిమితం కాలేదని, వాణిజ్యపరంగా గంగూలీ ఇమేజ్‌ను వాడుకున్నారని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ ఇప్పటికే విడుదలైన ఈ సినిమా థియేట్రికల్ ప్రదర్శనపై మాత్రం జోక్యం చేసుకోవడానికి కోర్టు నిరాకరించింది.దూస్రా సినిమా ప్రదర్శనను నిలిపివేయడానికి నిరాకరించినప్పటికీ చిత్ర నిర్మాణ సంస్థకు కొన్ని కఠిన



షరతులు విధించింది. సినిమాలో తగిన ప్రకటనను జోడించాలని, అలాగే రూ. 2 కోట్ల బ్యాంకు గ్యారెంటీని సమర్పించాలని ఆదేశించింది. అభినయ్ డియో దర్శకత్వం వహించిన 'దూస్రా: ఇండియాస్ అదర్ ఫ్రీడమ్ స్ట్రగుల్' మూవీలో ప్లాబితా బోర్తాకుర్, అంకుర్ వికల్, సమిధా గురు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా విడుదల కంటే ముందు కూడా పలు పిటిషన్లు దాఖలు అయ్యాయి. తాజా ఉత్తర్వులతో ఈ వివాదం క్రీడా, సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.